క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ఫారెస్టు పార్కు సమీపంలో గల హనుమకొండ–కరీంనగర్ ప్రధానరహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి నరేందర్, రాంపల్లి శారద వృద్ధ దంపతులు ద్విచక్రవాహనంపై కాజీపేట దర్గా నుంచి ఎల్కతుర్తి మండలం దామెర పకీర్‌షావలి దర్గాకు వస్తున్నారు. ఎల్కతుర్తికి చేరుకోగానే ద్విచక్రవాహనానికి లారీ (టిప్పర్) ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీయం ఆస్పత్రికి తరలించారు.

ఇష్టారాజ్యంగా మట్టి దందా

దామెర : మండలంలోని ఊరుగొండ పెద్దచెరువు నుంచి మట్టి తరలింపు ఇష్టారాజ్యంగా కొనసాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పెద్దచెరువులోని మట్టిని జేసీబీ సాయంతో తోడుతూ ట్రాక్టర్లలో తరలించారని తెలిపారు. మట్టిని తరలించాలంటే మైనింగ్, నీటిపారుదల అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా కొంతమంది అనుమతులు తీసుకోకుండా రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కెరీర్ గైడెన్స్ తరగతుల నిర్వహణ



ఐనవోలు : విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఒండిమామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం ప్రతాపరత్నకుమార్ తెలిపారు. శనివారం సైకాలజిస్ట్, మోటివేషన్ స్పీకర్ దాస్యపు మురళీధర్ 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ గురించి వివరించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలిపారు. పదోతరగతి తరువాత ఏయే అవకాశాలు ఉంటాయి.. అందుకు ప్రిపేర్ కావాల్సిన అంశాలను వివరించారు.

పంచాంగాల పంపిణీ



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో టీటీడీ ధర్మ ప్రచారక్ రంగనాథ స్వామి భక్తులకు శనివారం శ్రీ క్రోధ నామ సంవత్సర పంచాంగాలను శనివారం పంపిణీ చేశారు. తొలుత శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు, అర్చకులు రామాచార్యులు, సభ్యులు రేణుక, శ్రీలత, లక్ష్మి, పద్మ, అరుణ, త్రివేణి, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ రణధీర్, పూర్వవిద్యార్థి నితిన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు చెందిన వేద్ పిల్లల క్లినిక్ నిర్వాహకులు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కొట్టి చిరంజీవి, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనూశ, డాక్టర్ గణేశ్, నవీన్, వేణు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వర్ధన్నపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా తెలిపారు. పట్టణంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులను దళారుల బారి నుంచి కాపాడేలా, సరైన ధర కల్పించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకొచ్చి విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను మండలంలోని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న ఎండలు

- నిప్పులు కురిపిస్తున్న భానుడు
- నిర్మానుష్యంగా రోడ్లు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

పరకాల : వారం రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. సూర్యుడి ప్రతాపంతో జనం విలవిలలాడుతున్నారు. జిల్లాలో 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ నమోదు అవడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. పట్టణంలో మధ్యాహ్నం 1గంట నుంచి 4గంటల వరకు ఎండవేడిమితో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ముఖాలకు, తలకు రక్షణ కవచాలతో ప్రయాణికులు బయటకువస్తున్నారు. మరోవైపు ఎండలతో గిరాకీలు తగ్గిపోవడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. వివిధ అవసరాలకు రోడ్లపైకి వచ్చిన జనం తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కూల్ డ్రింక్స్, పండ్ల రసాల సేవించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటికి రాకుండా ఉంటే మంచిదని అన్నారు. ఎక్కువగా నీరు తాగాలని, దూరపు ప్రయాణాలు చేయకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.



పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి



హుజూరాబాద్ వెళ్లే రహదారిలో..



ఎండ తీవ్రతకు చున్నీ కప్పుకుని వెళ్తున్న మహిళలు

‘తుక్కుగూడ’కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన జనజాతర భారీ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు ప్రత్యేక వాహనాలను జెండా ఊపి ముందుకు కదిలించారు. వివిధ గ్రామాల నుంచి కూడా కాంగ్రెస్ శ్రేణులు తుక్కుగూడకు తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జన జాతర సభకు తరలివెళ్తున్న నాయకులు



శాయంపేటలో..



దామెరలో..



కమలాపూర్‌లో..



వేలేరులో..



పరకాలలో..



ఐనవోలులో..

‘నగలు తాకట్టుపెట్టి అభివృద్ధి పనులు చేశా’

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎస్‌ఎంసీ చైర్మన్ వేడుకోలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

దామెర : ‘గత సంవత్సరం ప్రభుత్వం సూచించిన పాఠశాల అభివృద్ధి పనులు చేసేందుకు భార్య నగలు బ్యాంక్‌లో కుదువ పెట్టి పనులు చేశాను. ఇప్పటి వరకు బిల్లులు పూర్తిగా చెల్లించలేదు. పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యే శరణ్య’ మని ఎస్‌ఎంసీ చైర్మన్ బోడ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విలేకరులకు తమ గోడు వెలబుచ్చుకున్నారు. గత సంవత్సరం పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా రూ. 30లక్షలు మంజూరు అయ్యాయని అన్నారు. ఇందులో రూ.14 లక్షలతో ప్రహరీ గోడ, కిచెన్‌షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కాగా రూ. 5 లక్షల 60వేలు మాత్రమే చెల్లించి మిగితా డబ్బులు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయని, త్వరగా పనులు పూర్తిచేస్తే చెల్లిస్తామని అధికారులు ఒత్తిడిచేశారని తెలిపారు. తన వద్ద డబ్బులు లేకున్నా తన భార్య నగలు బ్యాంకులో కుదువబెట్టి పనులు పూర్తి చేశానని వాపోయారు. తనకు రావాల్సిన రూ. 8 లక్షల 40వేల చెల్లించాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా బడ్జెట్ లేదంటూ దాటవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు.

‘స్కూల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి’

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పట్టణంలోని శ్రీచైతన్య ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు ప్రమోద్, ఏఐఎస్‌బీ జిల్లా కమిటీ సభ్యుడు సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ స్కూల్ సిబ్బంది పుస్తకాలను విక్రయించేందుకు వాహనాన్ని తీసుకురాగా విద్యార్థి సంఘాల నాయకులు శనివారం అడ్డుకున్నారు. విద్యాసంవత్సరం మొదలవకుండా పుస్తకాల విక్రయానికి తెగబడుతున్నారని నిలదీశారు. పట్టణంలోని అద్దె భవనంలో సేల్‌టాక్స్ చెల్లించకుండా, పర్మిషన్, ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండానే పాఠ్యపుస్తకాలు తీసుకొస్తున్నారని చెప్పారు. డీఈఓకు సమాచారం ఇచ్చేందుకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.



పుస్తకాలు తీసుకొస్తున్న సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

చలివేంద్రం ఏర్పాటు



సంగెం : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. బాటసారులు, ప్రయాణికులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఆర్‌ఐ బాలాజీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

‘మంద కృష్ణపై ఆరోపణలు సరికాదు’

సంగెం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు సరికాదని రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగ జాతికి చెందిన నేతలను కించపర్చేలా వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వెంటనే ఆరోపణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో నాయకులు మంద రాజు, తదితరులు పాల్గొన్నారు

శ్వేతార్కలో శనిత్రయోదశి పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలోని జేష్ఠాదేవి సమేత శనీశ్వరుడికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఐనవోలు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్ధమ శని, ఏలినాటి శని దోష పరిహారాల కోసం భక్తులు పూజలు చేశారు. శనిశ్వరుడికి నువ్వుల నూనెతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ పర్యవేక్షణలో నిత్య సహస్ర మోదక హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణ భవన్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్వో అయిత మణిదీప్, మేనేజర్ రవి, సుధీర్‌కుమార్, శ్రావణి, సేవకులు అనురాధ, గంజి భవాని, ప్రదీప్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

కళామంచ్ సింగిడి-2024 పోస్టర్ ఆవిష్కరణ

నర్సంపేట రూరల్ : ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రీయ కళామంచ్ సింగిడి–2024 రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల వాల్‌పోస్టర్‌ను నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈనెల 20, 21 తేదీల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సంఘం ఆందోళనలకే కాకుండా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతోపాటు ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, యువకవి సమ్మేళనం, శాస్త్రీయ గీతాలు, జానపద గీతాలు, రంగోలి, ఏకపాత్రాభినయం, సాంప్రదాయ వస్త్రాలంకరణ, లఘు చిత్రం, డప్పు, శిల్పకళ వంటి అంశాలపై ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, విఘ్నేశ్, శ్రీకాంత్, అరవింద్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి మాధవీలత

దామెర : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి మాధవీలత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు గుణాత్మక విద్యను అందిచడమే లక్ష్యంగా అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంజూరైన పనులను వీఓ, ఏఎల్‌ఎఫ్ ద్వారా చేపట్టాలని సూచించారు. రూ.25 వేల లోపు పనులను టెండర్లు లేకుండా చేపట్టాలని, 25వేల పైబడిన పనులను జిల్లా సమాఖ్య ద్వారా కలెక్టర్ నిధులు మంజూరు చేయాల్సి వస్తుందన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో మంజూరైన పనులు త్వరితగతిన ప్రారంభించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కల్పన, ఎంఈఓ రమాదేవి, ఆర్‌అండ్‌బీ డీఓ గౌస్, ఏపీఎం ఝాన్సీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీలత

అభ్యర్థిని మార్చకుంటే కాంగ్రెస్‌కు ఓటమే



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

శాయంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ స్థానాన్ని కడియం కావ్యకు కాకుండా మాదిగలకు కేటాయించాలని, లేని పక్షంలో పార్టీకి ఓటమి తప్పదని దళిత సంఘం నాయకులు అరికిళ్ల దేవయ్య, బహుజన వ్యవస్థాపక అధ్యక్షుడు మారెపల్లి క్రాంతికుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సమాజికవర్గానికి కాకుండా తక్కువ జనాభా కలిగిన ఉప కులాలకు చెందిన వారికి ఎంపీ టికెట్ కేటాయించడం మాదిగ జాతిని అవమానపరిచినట్లేనన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు సేవ చేయాలనే అంకిత భావంతో సేవా కార్యక్రమాలు చేస్తున్న దొమ్మాటి సాంబయ్యమాదిగకు అవకాశం ఇవ్వాలని కోరారు. రాజకీయ భవిష్యత్తు కోసం, స్వప్రయోజనాల కోసం రోజుకో పార్టీ మారే కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని మాదిగ జాతి పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు.

సఖి కేంద్రాన్ని వినియోగించుకోవాలి

- కేస్ వర్కర్ వినీల

శాయంపేట : సఖి కేంద్రం అందించే సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి టీం కేస్ వర్కర్ వినీల అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, నర్సింహులపల్లిలో శనివారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ కేంద్రంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గృహహింస, ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తోందన్నారు. చిన్న పిల్లలు, మహిళలకు జరుగుతున్న లైగింక వేధింపుల నివారణకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. మహిళలకు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181, ఫోన్‌నెంబర్ 0870–2452112కు ఫోన్ చేయాలన్నారు. సఖి కేంద్రం అందించే సేవలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కేస్ వర్కర్ హరిత, మహిళలు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న వినీల

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



ఎల్కతుర్తి : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



దామెర : టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్న నాయకులు

ఎల్కతుర్తి : భారతీయ జనతాపార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శనివారం (బీజేపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. అనంతరం ప్రయాణికులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడెపు శ్రీవర్ధన్, కంచర్ల శంకరయ్య, జనగాని కిష్టయ్య, పల్లెపాటి మధుకర్, చిదురాల వెంకటేష్, ఆరేపల్లి వినోద్, శ్రీకాంత్, స్వాతి, దేవేందర్, సాంబశివరెడ్డి, కోటేశ్వర్, రమణాచారి, మల్లయ్య, శ్రీనివాస్, రమేష్, అశోక్, సరూప పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో మండల అధ్యక్షుడు పృధ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

దామెర : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నాగరాజు, నియోజకవర్గ కోకన్వీనర్ రతన్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు రమేష్, రమేష్, సంతోష్, రమేష్, సతీష్, జిల్లా రమణారెడ్డి, ఐలయ్య, కొమురయ్య, శ్రీను, శ్రీనివాస్, రాజయ్య, మహేందర్ పాల్గొన్నారు.

వేలేరు : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అత్యధిక సీట్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు మాలోతు రాజు, కనకచారి, రజనీకాంత్, నవీన్, సురేందర్, అరవీంద్ తదతరులు పాల్గొన్నారు.



పరకాల : టిఫిన్ బైఠక్ నిర్వహిస్తున్న నాయకులు

పరకాలలో..

పరకాల : పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. 43వ బూత్ అధ్యక్షుడు, డాక్టర్ పగడాల కాశీప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌ను సాకారం చేసేందుకు పార్టీ కృషి చేస్తోందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 పైగా ఎంపీ స్థానాలు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందులో పరకాల మొదటి స్థానంలో ఉండేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురుప్రసాద్, సత్యనారాయణరావు, రాష్ట్ర నాయకులు మేఘనాథ్, జిల్లా ప్రధానకార్యదర్శి జయంత్‌లాల్, రామన్న, మాజీ సర్పంచ్ సతీష్, పట్టణ ప్రధానకార్యదర్శి నిరంజన్, కౌన్సిలర్లు భద్రయ్య, పూర్ణాచారి, ఉపాధ్యక్షులు పురుషోత్తం, నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శారద, కోశాధికారి సంతోష్, సత్యనారాయణ, అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కిశోర్, నరేష్, ప్రణయ్, సతీష్, సతీష్, నాయకులు శ్రీధర్, సారంగం, నరేష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.